
సాక్షి పశ్చిమగోదావరి

శనివారం : 28 : డిసెంబర్ : 2024



వర్గీకరణ రగడ

ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ రాకను మాలలు వ్యతిరేకించగా.. మాదిగలు స్వాగతిస్తూ ఏలూరులో కలెక్టరేట్ వద్ద బల ప్రదర్శనకు దిగారు. 8లో ▸



ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

చినవెంకన్న ఉత్తర ద్వార దర్శనానికి పటిష్ట ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. 8లో ▸



కన్నీళ్లు పెట్టిస్తే పుట్టగతులుండవు

ఆడపడుచులను కన్నీళ్లు పెట్టించేలా పశువధకు సహకరిస్తున్న వారికి పుట్టగతులుండవని మాజీ మంత్రి కారుమూరి అన్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

సంస్కరణల సారథి మన్మోహన్‌సింగ్



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మండలి చైర్మన్ మోషేనురాజు

భీమవరం: ఆర్థిక సంస్కరణల సారథి, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. భీమవరంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ మరణంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో అపర చాణక్యుడిగా మన్మోహన్ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా కన్వీనర్ గూడూరి ఉమాబాల మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ రాజకీయాలకు కొత్తభాష్యం చెప్పిన ఆర్థిక వేత్త అన్నారు. ముందుగా మన్మోహన్ చిత్రపటానికి మోషేనురాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వేండ్ర వెంకటస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు మేడిది జాన్సన్, గౌడ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహరావు, భీమవరం పట్టణ, వీరవాసరం, భీమవరం మండల అధ్యక్షులు గాదిరాజు రామరాజు, చవ్వాకుల సత్యనారాయణ, జిల్లా కొండయ్య, ఏఎస్ రాజు, కోడే యుగంధర్, బలే ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్శిల్ కేసులో సిబ్బందికి ఎస్పీ అభినందన



అభినందిస్తున్న ఎస్పీ నయీం అస్మి

సాక్షి, భీమవరం: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన డెడ్‌బాడీ పార్శిల్ కేసును జిల్లా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి వారం రోజుల్లోనే ఛేదించారు. భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య పర్యవేక్షణలో ఆకివీడు సీఐ వి.జగదీశ్వరరావు, ఉండి ఎస్సై ఎండీ నాసిరుల్లా, కాళ్ల ఎస్సై ఎస్.శ్రీనివాసరావు, ఆకివీడు ఎస్సై హెచ్.నాగరాజు తదితర వంద మంది సిబ్బందితో 11 బృందాలు ఏర్పాటుచేసి నిందితులను పట్టుకున్నారు. శుక్రవారం ఎస్పీ మీడియాకు వివరాలు వెల్లడించి త్వరితగతిన కేసును ఛేదించిన పోలీసులను అభినందించి శాలువాతో సత్కరించారు. ఏఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు, సైబర్–సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ జీవీవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మనసు పెట్టి పనిచేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ వైద్య సిబ్బంది మనసు పెట్టి పనిచేస్తే, పేదలు ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా కృషి చేయవచ్చని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. శుక్రవారం స్థానిక త్యాగరాజ భవన్‌లో వైద్యారోగ్య శాఖ, స్త్రీ శిశు, సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బందితో ఆయా శాఖల లక్ష్యాలు, లోటుపాట్లపై ఆమె సమీక్షించారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నామని, సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బి.భానునాయక్, డీఐఓ డి.దేవసుధా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన

సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ గోడౌన్‌ను కలెక్టర్ పరిశీలించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

కులగణన జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

భీమవరం (ప్రకాశంచౌక్): షెడ్యూల్ కులాల కులగణన జాబితాలో అభ్యంతరాలు ఉంటే అర్జీలను సమర్పించేందుకు విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని మండల, మున్సిపల్ కార్యాలయాలు, సచివాలయాల్లో షెడ్యూల్ కులాల జాబితాను ప్రకటించామని, అభ్యంతరాలను నెలాఖరు వరకూ స్వీకరిస్తామన్నారు. అలాగే హౌస్ హోల్డ్ డేటా, ఎంఎస్‌ఎంఈ యూనిట్ల సర్వే, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సభ్యుల ఈకేవైసీ అంశాలపై ఆమె సమీక్షించారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వై.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



నరసాపురం: ఎలక్ట్రికల్ ఈఈకి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



తణుకు అర్బన్: తణుకు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

● విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన గళం

సర్దుపోటుపై సమరభేరి

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలోకి తొక్కి అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచడంపై జిల్లావాసులు కదం తొక్కారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించి తమ నిరసన గళం వినిపించారు. పెంచిన చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ శుక్రవారం తలపెట్టిన విద్యుత్ పోరుబాటలో పెద్ద ఎత్తున విద్యుత్ వినియోగదారులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేశారు.

- వైఎస్సార్‌సీపీ పోరుబాటకు అనూహ్య స్పందన
- ప్రభుత్వ తీరును నిరసిస్తూ తరలివచ్చిన ప్రజలు
- నియోజకవర్గ కేంద్రాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ధర్నాలు
- పెంచిన చార్జీలు తగ్గించాలని డిమాండ్
- అధికారులకు వినతిపత్రాల అందజేత



భీమవరం: విద్యుత్ శాఖ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి ఉమాబాల, జిల్లా ఉపాధ్యక్షుడు మేడిది జాన్సన్



పాలకొల్లు: ఏడీఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి, నాయకులు

సాక్షి, భీమవరం: జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 'కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట' కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. ర్యాలీలు, మోటార్‌సైకిల్ ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ ఎన్నికల సభ జరిగినా విద్యుత్ చార్జీలు పెంచనని చంద్రబాబు పదేపదే చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలకు సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పన్నులు, చార్జీల రూపంలో భారం మోపుతున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలు చేయకపోవడం, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో ప్రజలు దుర్భర జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమంపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. పెంచిన విద్యుత్ విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

● తణుకులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేల్పూరు రోడ్డులోని కప్పల వెంకన్న సెంటర్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు పాదయాత్రగా ర్యాలీ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. తణుకు, ఇరగవరం, అత్తిలి ఎంపీపీలు రుద్రరాజు ధనరాజు, కొప్పిశెట్టి మంగతాయారు, సుంకర నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి తదితరులు పాల్గొన్నారు.

● భీమవరంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మేడిది జాన్సన్ ఇంటి వద్ద నుంచి ప్రదర్శనగా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయానికి వెళ్లి టెక్నికల్ డీఈ ఎం.ఝాన్సీకి వినతిపత్రం అందించారు. దారి పొడవునా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యుత్ అదనపు చార్జీలను తగ్గించాలని నినాదాలు చేశారు. పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, భీమవరం జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహరావు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, పార్టీ అధికార ప్రతినిధి కామన నాగేశ్వరావు, పెద్ద ఎత్తున నాయకులు పాల్గొన్నారు.

● పాలకొల్లులో నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి ఆధ్వర్యంలో పూలపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మోటార్ సైకిళ్లపై విద్యుత్ ఏఈ కార్యాలయం వరకూ ర్యాలీగా తరలివెళ్లారు. అధికారులకు వినతి పత్రం అందజేశారు. పార్టీ సీనియర్ నేత గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, జెడ్పీటీసీ సభ్యులు గుంటూరి పెద్దిరాజు, నడపన గోవిందరాజుల నాయుడు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఇంటి వద్ద నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వినియోగదారులు ర్యాలీగా పట్టణంలోని హౌసింగ్ బోర్డు సబ్‌స్టేషన్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, పట్టణ, మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

● ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, వినియోగదారులు ఆకివీడులోని వైఎస్సార్ సెంటర్‌లో గల దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి ఏడీఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఆకివీడు, ఉండి జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు, రణస్థల మహంకాళి, ఉండి ఎంపీపీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

● ఆచంటలో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, వినియోగదారులు తూర్పుపాలెం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు భారీ మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. పోడూరు, పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యులు గుంటూరి పెద్దిరాజు, కర్రి గౌరి సుభాషిణి, పెనుగొండ ఎంపీపీ పోతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద) పాల్గొన్నారు.

కూటమి సర్కారు మోసపు పాలన

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: కూటమి నాయకులు ఎన్నికల సమయంలో మోసపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని, ఆరు నెలల్లోనే ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసి మోసపు పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నరసాపురంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ముదునూరి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ చేసి నిరసన తెలిపారు. అనంతరం నరసాపురం ఎలక్ట్రికల్ ఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఈఈ మధుకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కూటమి సర్కార్ ప్రజల నెత్తిన మోయలేని భారం వేస్తోందన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై దొడ్డిదారిన వేస్తున్న భారాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల్లోనే రెండుసార్లు ట్రూఅప్ చార్జీల పేరుతో గృహ వినియోగదారులపై రూ.15,485.36 కోట్ల భారాన్ని మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. చార్జీలు తగ్గించాలని, ఎస్సీ, ఎస్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

అన్నివర్గాలకూ మొండిచేయి

కూటమి ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం, మహిళలకు నెలకు రూ.1,500 వంటి హామీలను విస్మరించి మోసం చేసిందని ముదునూరి అన్నారు. దీనికితోడు పల్లెపల్లెనా బెల్టు షాపులు పెట్టి జనాన్ని మత్తులో ముంచుతున్నారని ఆరోపించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఈఈ కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. మున్సిపల్ చైర్మన్ బర్రె శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, ఎంపీపీ మైలాబత్తుల సోని, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, నాయకులు పాల్గొన్నారు.



ఆకివీడు: వినతిపత్రం అందిస్తున్న ఉండి నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నర్సింహారాజు



పెనుగొండ: ఆచంటలో సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



తాడేపల్లిగూడెం అర్బన్: సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సోలార్ విద్యుత్‌తో పర్యావరణానికి మేలు



పవర్ ప్లాంట్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఎండీ పృథ్వీతేజ్

ద్వారకాతిరుమల: ప్రభుత్వం అందించే సబ్సిడీని ప్రతి గృహ విద్యుత్ వినియోగదారుడు సద్వినియోగం చేసుకుని, పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్, ఎండీ ఇమ్మడి పృథ్వీ తేజ్ సూచించారు. ద్వారకాతిరుమలలో ఆర్‌ఎస్ నం.47లో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజనీర్ పి.సాల్మన్ రాజు, ఈఈ కేఎం అంబేడ్కర్, అధికారులు సోలార్ పవర్ ప్లాంట్ వివరాలను వివరించారు. అధికారులకు ఆయన పలు సూచనలు, సలహాలనిచ్చారు. అనంతరం పృథ్వీతేజ్ మాట్లాడుతూ ఏపీఈపీడీసీఎల్ తొలి మోడల్ సోలార్ విలేజ్‌గా ద్వారకాతిరుమల మండలాన్ని ఎంపిక చేసిందన్నారు. దీనిలో భాగంగా పైలట్ ప్రాజెక్ట్ కింద 750 కేపీ సోలార్ పవర్ ప్లాంట్‌ను ఇక్కడ నిర్మించనున్నట్టు చెప్పారు. గృహ వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చని, అలాగే మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించి లబ్ధి పొందొచ్చని సూచించారు. సోలార్ ద్వారా సౌర శక్తిని వినియోగిస్తే, భూమిపై కర్బన ఉద్గారాలు తగ్గుతాయని, దాని వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్స్ ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నట్టు చెప్పారు.

పన్నుల వసూళ్లు వేగిరపర్చాలి

మున్సిపల్ ఏఆర్డీ నాగనరసింహారావు

జంగారెడ్డిగూడెం: ఇంటి, కుళాయి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాల అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్, అఫిలియేట్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ప్రజలను కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. జంగారెడ్డిగూడెం సచివాలయాల సెక్రటరీలు ఆలస్యంగా అటెండెన్స్ వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. యానిమల్ బర్త్ కంట్రోల్‌ను త్వరలో ప్రారంభిస్తామని, అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. చాలా ఖాళీ స్థలాలకు యజమానులు ఎవరో తెలియడం లేదని, అటువంటి చోట్ల మున్సిపాలిటీ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. యజమానులను గుర్తించి నోటీసులు ఇస్తామన్నారు. తన పరిధిలో ఏడు జిల్లాలు, 29 మున్సిపాలిటీలు ఉన్నాయన్నారు. కమిషనర్లు ఎ.భానుప్రతాప్, కేవీ రమణ, వెంకట రామిరెడ్డి, డి.పావని తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై మతలబు ఏంటో?

- గతంలో ధ్వంసం చేయమని లోకేష్ చెప్పారు
- ఇప్పుడు పెట్టమంటున్నారు
- సీపీఎం కార్యదర్శి శ్రీనివాసరావు నిలదీత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నరసాపురం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తే ధ్వంసం చేయమని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన నారా లోకేష్.. ఇప్పుడు గృహాలకు స్మార్ట్‌మీటర్లు పెడతామని చెబుతున్నారని, ఇదెక్కడి మతలబో చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. నరసాపురంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల ముగింపు సందర్భంగా శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అప్పుడు తప్పు అయ్యింది, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తుంటే ఒప్పు ఎలా అవుతుందో మంత్రి లోకేష్ చెప్పాలన్నారు. ఓ పక్క దొడ్డిదారిలో విద్యుత్ చార్జీలు పెంచుతూ మరోపక్క స్మార్ట్‌మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల కాంట్రాక్ట్ అదానీకి ఇచ్చారని, రూ.20 వేల విలువ చేసే ఈ మీటర్ల మొత్తాన్ని కూడా ప్రతినెలా ఇచ్చే విద్యుత్ బిల్లుల్లో కలుపుతారని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ చేసిన ప్రతి పనినీ తప్పుపట్టిన టీడీపీ.. అధికారంలోకి వచ్చాక అవే పనులు చేస్తోందన్నారు. ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో విఫలమయ్యిందని విమర్శించారు. రాష్ట్ర సమావేశాల్లో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సుదీర్ఘంగా చర్చించామని చెప్పారు. ప్రజల తరఫున ఆందోళనలు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారామ్, వై.శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం, పూర్లిళ్ల శ్రీనివాస్, కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

తాళం పగులగొట్టి చోరీ యత్నం



ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు

నూజివీడు: స్థానిక సమతానగర్‌లో గురువారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న దొంగలు చోరీ యత్నం చేశారు. స్థానికంగా నివాసం ఉండే రిటైర్డ్ తహసీల్దార్ సూరానేని జగన్నాథరావు కుటుంబం వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో తాళాన్ని బద్దలకొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. ఒక బీరువా తాళం రాగా అందులోని సామగ్రిని సైతం చిందరవందరగా పడేశాడు. మరో బీరువా తాళం రాకపోవడంతో ఏమీ చేయలేకపోయాడు. వస్తువులు ఏమీ పోకపోవడంతో కుటుంబ సభ్యులు, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. ఉదయాన్నే ఇంటి వద్ద ముగ్గు వేసేందుకు పని మనిషి వచ్చి గేటు తీసి లోపలికి వెళ్లగా తలుపులు తీసి ఉండడాన్ని గమనించింది. దీంతో చోరీ జరిగిందని గుర్తించి చుట్టుపక్కల వారికి తెలపగా వారు హైదరాబాద్‌లో ఉన్న ఇంటి యజమానికి, స్థానిక పోలీసులకు సమాచారమందించారు. పట్టణ సీఐ పి.సత్య శ్రీనివాస్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీజిల్ ఇంజిన్ చోరీపై కేసు

తాడేపల్లిగూడెం రూరల్: పొలానికి నీరు తోడుకునే డీజిల్ ఇంజిన్ చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై జేవీఎన్. ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆరుగొలను గ్రామానికి చెందిన చిక్కాల సత్యప్రసాద్ వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. సత్యప్రసాద్ తన పొలంలోని డీజిల్ ఇంజిన్ ద్వారా నీరు తోడుకుని సాయంత్రం సమయంలో ఇంజిన్ ఆఫ్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు తిరిగి వచ్చేసరికి డీజిల్ ఇంజన్ కనిపించలేదు. ఈ ఘటన నవంబరు 28న జరిగింది. డీజిల్ ఇంజన్ కోసం పరిసర గ్రామాల్లో వెతికినా కనిపించకపోవడంతో గురువారం సాయంత్రం రూరల్ పోలీసులను ఆశ్రయించాడు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

పెంటపాడు: మండలంలోని బి.కొండేపాడు గ్రామంలో ఓ వృద్ధుడు శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పెంటపాడు ఏఎస్సై రాజేంద్ర తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పొత్తూరి చినవెంకన్న(77) తన మనుమలతో కలిసి గ్రామంలో ఉంటున్నాడు. కాగా గురువారం రాత్రి పడుకున్న వెంకన్న శుక్రవారం తెల్లారేసరికి మంచంపై చనిపోయిఉన్నాడు. చెవి నుంచి రక్తం కూడా రావడంతో కుటుంబసభ్యులు కంగారుపడి పెంటపాడు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పెంటపాడు ఏఎస్సై రాజేంద్ర పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

పెంటపాడు: గ్రామంలోని ఊరచెరువులో పడి గురువారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందాడు. పెంటపాడు హెచ్‌సీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం గూడెం, పెంటపాడు ప్రాంతాల్లో సైకిల్‌పై పండ్ల వ్యాపారం చేసుకునే దాడి వెంకటరమణ అలియాస్ శ్రీను (40) గురువారం కూడా పెంటపాడులో పండ్ల వ్యాపారం చేశాడు. అయితే శుక్రవారం ఉదయానికి స్థానిక ఊర చెరువులో శ్రీను మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పంచాయతీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో గ్రామ కార్యదర్శి గోడి బాలకృష్ణ పెంటపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కలుషితమైన నీటిని హుటాహుటిన బయటకు తోడించే పనిలో పడ్డారు. హెచ్‌సీ ప్రసాద్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.

కలెక్టరేట్ వద్ద వర్గీకరణ రగడ

- ఏకసభ్య కమిషన్ రాకతో పోటాపోటీ ప్రదర్శనలు
- వినతులు ఇచ్చేందుకు క్యూ



ఏలూరు కలెక్టరేట్ వద్ద ఏకసభ్య కమిషన్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తున్న మాల సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌కు విచ్చేశారు. అయితే రాజీవ్ రంజన్ మిశ్రా రాకను మాలలు వ్యతిరేకిస్తూ..మాదిగలు స్వాగతిస్తూ కలెక్టరేట్ వద్ద బలప్రదర్శనకు దిగారు. దీంతో వ్యతిరేక, అనుకూల నినాదాలతో ఏలూరు కలెక్టరేట్ ప్రాంతం మారుమోగింది. రెండు కులాలకు చెందిన నేతలు పెద్ద సంఖ్యలో ఏలూరు కలెక్టరేట్‌కు తమ తమ అభిప్రాయాలతో కూడిన వినతి పత్రాలు అందించేందుకు సిద్ధమయ్యారు. ఉదయం 10 గంటలు దాటాక ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు.



ఏకసభ్య కమిషన్‌ను స్వాగతిస్తూ ర్యాలీగా వస్తున్న మాదిగ నాయకులు, కార్యకర్తలు

ఈ సందర్భంగా వారు కమిషన్ రాకను స్వాగతిస్తున్నామని, ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు ఎస్సీల్లోని 58 ఉపకులాలకు జనాభానిష్పత్తి ప్రకారం అందించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీనికి ప్రతిగా అక్కడే ఉన్న మాలలు సైతం ఆర్‌ఆర్ మిశ్రా ఏకసభ్య కమిషన్ గో బ్యాక్, ఎస్సీల వర్గీకరణ వద్దు..ఐక్యతే ముద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో కొద్దిగా సద్దుమణిగింది. ఏకసభ్య కమిషన్ ఎదుట తమ అభిప్రాయం తెలిపేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 నియోజకవర్గాల నుంచి నాయకులు, ప్రజలు,ఉద్యోగులు, న్యాయవాదులు, సామాజిక వాదులు పెద్ద సంఖ్యలో ఏలూరు రావడంతో కలెక్టరేట్ ప్రాంతంలో హడావుడి నెలకొంది.

వినతుల వెల్లువ

ఏలూరు విచ్చేసిన ఏకసభ్య కమిషన్‌కు ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ అంశం అనేది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. కార్యక్రమంలో నూకపెయ్యి కార్తీక్, పులవర్తి డేవిడ్, గారపాటి నాగేశ్వరరావు, తెనాలి సురేష్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ ఆధ్వర్యంలో వర్గీకరణకు అనుకూలంగా వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ముస్నంగి నాగరాజు, ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, రుద్రపోగు సురేష్, బయ్యారపు రాజేశ్వరరావు పాల్గొన్నారు. మాల ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బేతాళ సుదర్శనం, అంబేడ్కర్ పూలే వేదిక చైర్మన్ నేతల రమేష్ బాబు ఆధ్వర్యంలో వినతి అందించారు. ది ఎర్త్ రైట్ ఫోరం, ఏపీ దళిత ప్రొటెక్షన్ ఫోరం మాల సంఘాల తరపున వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, చాగంటి సంజీవ్ కుమార్, పల్లెం ప్రసాద్, దాసరి శ్యామ్ పాల్గొన్నారు.

స్పష్టమైన సమాచారం అందించాలి



వర్గీకరణపై వినతులు స్వీకరిస్తున్న రాజీవ్ రంజన్ మిశ్రా

ఏలూరు(మెట్రో): ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి స్వాగతం పలికి పూల మొక్కలను అందజేశారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు సంబంధించి జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణకు సంబంధించి ఆయా శాఖల వారీగా పూర్తి సమాచారాన్ని వెంటనే కమిషన్‌కు సమర్పించాలన్నారు. అనంతరం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. సుమారు 600 మంది హాజరై 132 విజ్ఞాపనలు అందజేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వినతులు, అభ్యంతరాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులు, అభ్యంతరాలను పూర్తిగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. ఇంకా వినతులు ఇవ్వాల్సిన వారు ఉంటే విజయవాడ గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌కు అందించవచ్చని స్పష్టం చేశారు. అలాగే omcscsubclassification@gmail.com మెయిల్ ఐడీకు కూడా వినతులు సమర్పించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాష్, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, డ్వామా పీడీ సుబ్బారావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎస్.రామ్మోమోహన్‌రావు, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి ఉత్తర ద్వార దర్శనానికి పటిష్ట ఏర్పాట్లు



ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఆలయ ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఉత్తర ద్వార దర్శనానికి పటిష్ట ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ప్రస్తుత ఈఓ ఎన్వీ సత్యనారాయణమూర్తి నెలరోజులు సెలవు పెట్టడంతో, ఇన్‌చార్జ్ ఈఓగా త్రినాథరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆ తర్వాత ఆలయ కార్యాలయంలో చార్జ్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీవీ భాస్కర్, ఏఈఓలు, సూపరింటెండెంట్‌లు ఈఓను సత్కరించి, పూల బొకేలను అందజేశారు. అనంతరం త్రినాథరావు వారితో వచ్చే నెల 10న ఆలయంలో జరగనున్న శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లపై సమీక్షించారు. సామాన్య భక్తులకు సులువుగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. భక్తుల రక్షణకు, సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేయాలన్నారు. అలాగే వీఐపీలు, వీవీఐపీల ప్రొటోకాల్ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ శ్రీవారి ఉత్తర ద్వార దర్శనానికి ముందురోజు 9న గిరి ప్రదక్షిణ వేడుకను అట్టహాసంగా నిర్వహిస్తామన్నారు. గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి పాదుకా మండపం వద్ద ప్రారంభమవుతుందన్నారు. అలాగే ఆ రోజు రాత్రి 7 గంటల నుంచి శ్రీ వారి నిజరూప దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పిస్తామన్నారు.

మన్మోహన్‌కు భారతరత్న ప్రకటించాలి



కొయ్యలగూడెం గణేష్ సెంటర్లో మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సునీల్, బాలరాజు

కొయ్యలగూడెం: దివంగత మాజీ ప్రధాని, పద్మ విభూషణ్ మన్మోహన్‌సింగ్‌కి భారత అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్ పేర్కొన్నారు. స్థానిక గణేష్ సెంటర్ మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మన్మోహన్ సింగ్ సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. సంక్షోభ సమయంలో ఉన్న దేశానికి నాడు ఆర్థిక సంస్కరణల పితామహునిగా 1990వ దశకంలో భారతావని అభివృద్ధికి మన్మోహన్‌సింగ్ చూపిన బాటలు నేటికీ కూడా అమలవుతున్నాయన్నారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి ఇద్దరు నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో దాసరి విష్ణు, పశుపులేటి రాంబాబు, మందపాటి రామకృష్ణ, గంటా రమేష్, ఎంపీటీసీలు బిరుదుగట్ల రత్నకుమారి, ఘంటసాల సీనమ్మ, గంటా శ్రీను, ఎస్‌కే బాజీ పాల్గొన్నారు.

ఆడపడుచులను కన్నీళ్లు పెట్టిస్తే పుట్టగతులుండవు

మాజీ మంత్రి కారుమూరి



తేతలిలో నిరసన శిబిరం వద్ద సేవ్ తణుకు-సేవ్ తేతలి పోస్టర్‌లను చూపిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : పాలు ఇస్తున్న పశువుల రక్తపాతంతోపాటు ఆడపడుచుల కళ్లనీళ్లు పెట్టించేలా పశువధకు సహకరిస్తున్న వారికి పుట్టగతులుండవని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మండలం తేతలి సత్యవాడ రోడ్డులో పశువధ నిర్వహిస్తున్న లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నిరసన శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ కంట నీరు పెట్టుకుంటున్న ఆడబిడ్డల ఉసురు తగిలితే సర్వనాశనం అయిపోతారని హెచ్చరించారు. ఒక్క ఫోన్ కాల్‌తో కర్మాగారాన్ని మూయించే అధికారం ఎమ్మెల్యేకి ఉంటుందని కానీ తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాత్రం పశువధ నిర్వహిస్తున ప్రాంతవాసుల కష్టాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అన్నింటికీ డబ్బే ప్రధానం కాదని, కర్మాగారం యాజమాన్యం నుంచి ఇప్పటికే పైనుంచి కింది వరకు కోట్లాది రూపాయలు డబ్బు మారడం వల్లే ఈ పశువధ ఆగడంలేదనే విషయం ప్రజలు తెలుసుకున్నారని ఎద్దేవా చేశారు.

పావలా వాటాతో 'పావలా ఎమ్మెల్యే'

మద్యాన్ని ఏరులై పారిస్తూ మద్యం ప్రియుల జేబులు గుల్ల చేస్తున్నారని, మద్యం వ్యాపారాల్లో పావలా వాటాతో తమ ఎమ్మెల్యే పావలా ఎమ్మెల్యే అని ప్రజలు తెలుసుకున్నారని, ఇక డబ్బు కోసం తాపత్రయపడకుండా కర్మాగారం చుట్టూ ఉన్న ప్రజలను దృష్టిలో పెట్టుకోవాలని కారుమూరి విజ్ఞప్తి చేశారు. అలాగే పశువధ శాల ముందు ఏర్పాటు చేసిన నిరసన శిబిరం వద్ద తేతలి గ్రామస్తుల ఇలవేలుపు గోగులమ్మ తల్లిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్డులో నిలబెట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోసేవా సమితి ఆధ్వర్యంలో గోగులమ్మ తల్లి విగ్రహం ముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోధునిలో ఆవు పిడకలు వేసి ధుని వెలిగించారు. కర్మాగారం మూతపడే వరకు ఈ గోధుని వెలుగుతూనే ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా స్థానికులు రూపాయి రూపాయి కూడబెట్టి పగలు రాత్రి కష్టపడి ఇటుక ఇటుక పేర్చి మా స్థోమత మేరకు ఇళ్లు నిర్మించుకున్నామని, ఒక వేళ మీకు పశువధశాలే ముఖ్యమైతే మేము నిర్మించుకున్న ఇళ్లకు ఖరీదు కట్టి డబ్బు ఇప్పిస్తే మీ ప్రాంతం నుంచి వదలివెళ్లిపోతామని సవాల్ విసిరారు. కార్యక్రమంలో తేతలి గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ, అఘోరా అఖాడా జాతీయ ఉపాధ్యక్షుడు రాజేష్‌నాథ్‌జీ అఘోరీ, గోసేవా సమితి సభ్యులు కొండ్రెడ్డి శ్రీనివాస్, జల్లూరి జగదీష్, పోలిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వతంగా మూసేయాలని అఖిలపక్ష తీర్మానం

తణుకు అర్బన్: తేతలి గ్రామ పరిధిలోని సత్యవాడ రోడ్డులో అక్రమంగా పశువధ నిర్వహిస్తున్న లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థను శాశ్వతంగా మూసివేసేంతవరకు పోరాటానికి సిద్ధమని తణుకు అఖిలపక్షం తీర్మానించింది. తణుకు సురాజ్యభవన్‌లో శుక్రవారం రాజకీయ పార్టీలు, గోసేవా సమితి సభ్యులు అఖిలపక్షం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కర్మాగారం తణుకులో పునాదులు పడిన రోజు నుంచి ఇప్పటివరకు ఏం జరిగిందనే విషయాలను కూలంకుషంగా చర్చించుకున్నారు. కర్మాగారాన్ని మూయించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేశారు. ముందుగా పట్టణంలో రిలే నిరాహార దీక్షలు, తరువాత శాంతి ర్యాలీలు, అవసరమైతే తణుకు నియోజకవర్గం బంద్‌కు కూడా పిలుపు నివ్వనున్నట్లుగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఉంటే కర్మాగారం ఉండాలి లేదంటే నేనుండాలి అని అఘోరా అఖాడా జాతీయ ఉపాధ్యక్షుడు రాజేష్‌నాథ్‌జీ అఘోరీ అనగా ఈ కర్మాగారాన్ని మూయించలేని పక్షంలో నా తల తెగ్గోసుకుంటానని మాజీమంత్రి కారుమూరి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, కాంగ్రెస్ పార్టీ తణుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దిర్సిపో రామకృష్ణ, రామరాజ్యం వ్యవస్థాపకులు కొవ్వూరి వీరరాఘవరెడ్డి, గోసేవా సమితి సభ్యులు కొండ్రెడ్డి శ్రీనివాస్, జల్లూరి జగదీష్, కాకిలేటి రాజేంద్రప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు వి.సీతారాం, మంగెన సూర్య, డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు, తేతలి గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ పాల్గొన్నారు.



తణుకులో అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

ఈకేవైసీ బాధ్యతను సహకార సంఘాలకు అప్పగించాలి



వెంకట సుబ్బారావు

భీమవరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఈకేవైసీ కంప్యూటరైజేషన్ బాధ్యతను సహకార పరపతి సంఘాలకు అప్పగించాలని సహకార సంఘ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నందమూరి సుబ్బారావు అన్నారు. భీమవరం మండలంలోని తాడేరు గ్రామంలో సహకార పరపతి సంఘంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈకేవైసీ కంప్యూటరైజేషన్ బాధ్యతను సచివాలయ సిబ్బందికి కాకుండా సహకార సంఘాల సిబ్బందికి అప్పగించి రెండు నెలలు గడువు ఇస్తే పూర్తి చేస్తారన్నారు. సైబర్ నేరాల నేపథ్యంలో సచివాలయ సిబ్బంది రైతులకు ఫోన్ చేసి ఓటీపీ అడగడంతో భయపడుతున్నారని, అందువల్ల ఈ-కేవైసీ బాధ్యతను సహకార సంఘాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: స్థానిక మత్స్యశాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. సుమారు 135 సంఘాలకు చెందిన అధ్యక్షులు పాల్గొని 11 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి సమక్షంలో డైరెక్టర్లు అధ్యక్షుడు, కార్యదర్శిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా నరసాపురం మండలం రాజుల్లంక ప్రాంతానికి చెందిన మైల వసంతరావు, కార్యదర్శిగా పెంటపాడు మండలానికి చెందిన రాజా బాలాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి, బాదంపూడి ఎఫ్‌డీఓ రవి వెల్లడించారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



గోపినాథపట్నంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న కొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు : మండలంలోని గోపినాథపట్నం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు విగ్రహాల ప్రతిష్టాపనలు చేశారు. కార్యక్రమంలో దేవదాయ, ధర్మదాయ శాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, సాదినీ కుమారి దంపతులు పూజల్లో పాల్గొని వైదిక క్రతువులను నిర్వహించారు. ఆలయ క్షేత్రంలో భక్తాంజనేయస్వామి, సుబ్రహమణ్యస్వామి, గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణంలో రావి చెట్టు కింద ఉత్తర ముఖంగా సరస్వతి , హయగ్రీవుడు, తూర్పుముఖంగా గణపతి, దక్షిణ ముఖంగా ఆంజనేయస్వామి, దక్షిణామూర్తి విగ్రహాలు ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఆలయ శిఖరం చుట్టూ నాలుగు దిశల్లో దిశకు రెండు ఒంటెలు చొప్పున 8 ఒంటెలను కొట్టు సత్యనారాయణ ప్రతిష్ఠించారు. అనంతరం పండితులు చక్రవర్తి ఆధ్వర్యంలో పూజలు ప్రత్యేక నిర్వహించారు.

అధికారుల నిర్ణయాలతోనే చెడ్డపేరు



ఎంప్లాయీస్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి అప్పల నాయుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతపై ఇచ్చిన సర్క్యులర్ నెం 01/2019 అమలు చేయాలని రవాణామంత్రి, ఆర్టీసీ ఎండీ, ఇతర ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ కొంత మంది కిందిస్థాయి అధికారులు మాత్రం ఈ సర్క్యులర్‌ని అమలు చేయకుండా ఉద్యోగుల ఆత్మాభిమానం దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఏలూరు జిల్లా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ విస్తృతస్థాయి కౌన్సిల్ సమావేశం ఆ సంఘ జోనల్ అధ్యక్షుడు ఎంఎస్ రావు అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి బి.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ సమస్యలు సృష్టించి ఆర్టీసీ ఉద్యోగులను ఉద్యమాల వైపునకు బలవంతంగా నెడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ఉప ప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్, జోనల్ కార్యదర్శి వై. శ్రీనివాసరారావు పాల్గొన్నారు.

యువతిపై దాడి చేసిన నలుగురిపై కేసు

తాడేపల్లిగూడెం రూరల్: యువతిని ఉద్యోగం పేరిట నమ్మించి మోసగించడమే కాకుండా ఆమెను కులం పేరుతో దూషించి దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని పెదతాడేపల్లి గ్రామానికి చెందిన చవటపాము బాలకృష్ణ, చవటపాము సంధ్య నాగశ్రీ ఉద్యోగం ఇప్పిస్తానని లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన సొంగా శ్రావణి వద్ద దఫదఫాలుగా రూ.8 లక్షలు నగదు, మూడున్నర కాసుల బంగారం తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించకపోగా తనను గత నెల 28న చవటపాము బాలకృష్ణ ఇంటికి రమ్మని, డబ్బులు అడగడంతో కులం పేరుతో దూషించి, ఫోన్ లాక్కుని చవటపాము సంధ్య నాగశ్రీ, గోపి హేమనందిని, అచ్యుతాంబ కలిసి దాడి చేశారని బాధితురాలు సొంగా శ్రావణి శుక్రవారం రూరల్ పోలీసులను ఆశ్రయించింది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

తణుకు అర్బన్: కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని దువ్వ గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం తెల్లవారుజామున సమయంలో వయ్యేరు వెంకయ్య కాలువ వంతెన సమీపంలో 60 నుంచి 65 సంవత్సరాల వయస్సున్న వృద్ధుడిని తణుకు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వృద్ధుడి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మృతుడు యాచకుడిగా గుర్తించారు. తణుకు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ 'గూడెం' మండల అధ్యక్షుడిగా హరిబాబు


జడ్డు హరిబాబు

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం మండల పార్టీ అధ్యక్షుడిగా జడ్డు హరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. రెండవ సారి హరిబాబు మండల పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా పార్టీఅధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

సదస్సులతో రైతులకు మేలు


ధ్రువపత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ సునీల్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు మేలు కోసమే ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని నందమూరు, ఆరుళ్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు, రైతులు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని కోరారు. నందమూరు ఏడు, ఆరుళ్ల సదస్సుకు 20 అర్జీలు అందాయని తహసీల్దార్ సునీల్‌కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నర్సయ్య, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మానవతా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంలో భాగంగా మెమొరీ టెక్నిక్స్, ఎడ్యుకేషన్ టెక్నిక్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిత్వ వికాసం నిపుణులు టి.గంగాధర్ రెడ్డి ప్రసంగించారు. విద్యార్థులకు పెన్నులు అందజేశారు. గంగాధర్‌కు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ స్థానిక అధ్యక్షుడు పచ్చ వెంకటేశ్వరరావు, జనపనేని రాజేంద్ర ప్రసాద్, చేకూరి బంగ్రారాజు, యర్ర ఆంజనేయ స్వామి, యెగ్గిన శరత్, బి.సతీష్, కె.వెంకటాచలం, గురుమూర్తి, సోమేశ్వరరావు, సారధి, ఇంచార్జి ప్రిన్సిపాల్ రమణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి


తణుకులో రక్తదానం చేస్తున్న యువకులు

తణుకు అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు కొనియాడారు. కారుమంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో యువకులు రక్తదానం చేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బ్లడ్ బ్యాంక్ మేనేజరు కారుమంచి యోహాను తెలిపారు. అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సిన వారికి ఈ రక్తదాన శిబిరాలు సద్వినియోగపడతాయని తెలిపారు. సీహెచ్ ధరణి తేజ, ఎ.రాజేష్, టి.రామసురేష్, ఎ.సురేష్, జె.దత్తాత్రేయ రక్తదానం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఉండ్రాజవరపు రామ్‌చరణ్, మల్లిపూడి సంజయ్, సాయి, ముప్పిడి బాలు, బెన్ను పాల్గొన్నారు.

డీఆర్‌జీ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని జరిగిన వ్యాసరచన, వకృత్వ పోటీలలో రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎన్ ప్రసాద్, అధ్యాపకులు సుంకర గోపాల్, గంధం వాణి, జాన్‌బాబు, ప్రేమ్‌సాగర్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు గుల్ల చేస్తున్న కూటమి

- పేదలపై విద్యుత్ బిల్లుల పిడుగు
- ప్రజల నుంచి దోచి సంపద సృష్టించుకుంటున్న వైనం
- తణుకులో పోటెత్తిన వైఎస్సార్‌సీపీ పోరుబాట
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు


తణుకు విద్యుత్ శాఖలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: విద్యుత్ చార్జీలు పెంచమని నాణ్యమైన విద్యుత్ అందిస్తానని అవసరమైతే తగ్గిస్తామన్న చంద్రబాబు నేడు సామాన్యుడి ఇళ్లు గుల్ల చేసే విధంగా విద్యుత్ చార్జీలను పెంచారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాలను భిక్షాధికారులుగా మార్చేందుకు చంద్రబాబు కుట్రపన్నారని విమర్శించారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని సంపద సృష్టిస్తానని భింకాలు పోయిన చంద్రబాబు ప్రజల నుంచి బాదుడు కార్యక్రమాన్ని చేపట్టి సంపద సృష్టిస్తున్నారా అని ప్రశ్నించారు. బతుకే భారమైపోయి ఇబ్బందులు పడుతున్న రోజుల్లో పేదలపై విద్యుత్ బిల్లుల పేరుతో దోపిడీ చేస్తున్నారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ అని చెప్పి అందలమెక్కిన తర్వాత బాదుడే బాదుడుకి సూపర్‌బాదుడు చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రూ.15వేల కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజలపై వేసి వారి నడ్డి విరచడానికి మనసెలా ఒప్పిందని నిలదీశారు. గత ఐదేళ్లలో సంక్షేమం అంటే ఏంటో చూపించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాలెండర్ ప్రకారం ప్రతినెలా ఏదోక పథకాన్ని అందజేసి మహిళలను ఆర్థికంగా నిలబడితే నేడు ఆ సంక్షేమాన్ని తొలగించి ప్రజల డబ్బుతో ఖజానా నింపుకునేందుకు దారులు వెతుకున్నాడని అన్నారు. విద్య, వైద్యం అటకెక్కిందని, కూటమి ప్రభుత్వం కారణంగా పేదింటి పిల్లల చదువు కూడా అటకెక్కుంతుందని మళ్లీ పిల్లలు కార్మికుల అవతారం ఎత్తే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ కార్యాలయంలోని జేఈ బి.సంఘమిత్ర, సీనియర్ అసిస్టెంట్ కేవై సతీష్‌కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు.


విద్యుత్ శాఖ డీఈకి వినతిపత్రాన్ని అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు విద్యుత్ చార్జీల పెంపుపై మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ పోరుబాట ర్యాలీ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కారుమూరి అభిమానులు తణుకు కప్పల వెంకన్న సెంటర్ నుంచి వేల్పూరు రోడ్డు మీదుగా విద్యుత్ శాఖ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు బుద్ధరాతి భరణిప్రసాద్, నత్తా కృష్ణవేణి, ఉండవల్లి జానకి, తణుకు, అత్తిలి, ఇరగవరం ఎంపీపీలు రుద్రా ధనరాజు, సుంకర నాగేశ్వరరావు, కొప్పిశెట్టి మంగతాయారు. జెడ్పీటీసీ అడ్డాల జానకి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్ససుబ్బరాజు, పెన్మెత్స రామరాజు, మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వి.సీతారాం, మెహర్ అన్సారీ, నూకల కనకదుర్గ, మెట్ల కిరణ్మయి, కాకర్ల విశాలాక్షి, షేక్ ఫహీమా, సతీష్, రామిశెట్టి రాము, పొట్ల సురేష్, జంగం ఆనంద్‌కుమార్, బుడితి సుజన్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు అధనపు చార్జీలు పెంచడం ప్రజలకు భారంగా మారిందని తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వన్‌టౌన్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, బొద్దాని శ్రీనివాసు, గార్లపాటి వీరకుమార్, వట్టి బుజ్జి, బండారు నాగు, కైకాల శ్రీనివాసు, గుండుమోగుల సాంబయ్య, సర్పణి రామకృష్ణ, వెలిశెట్టి నరేంద్ర కుమార్, చామన సూర్యచంద్రరావు, సొట్ల ఏడుకొండలు, దాసిబాబు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా పోలీసుల వ్యవహారం


తేతలిలో పశువధ శాల ముందు ఎస్‌ఐతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

- ఒక్క ఫోన్‌కాలతో డ్రోన్ కెమెరా స్వాధీనం
- పశు వధశాలను చిత్రీకరించలేదని నిర్ధారించుకుని కెమెరా అప్పగింత

తణుకు అర్బన్: అక్రమంగా, నిర్బంధంగా, స్థానిక మహిళలను ఉసురుపెట్టి నిర్వహిస్తున్న పశు వధశాలపై పోలీసులు కురిపిస్తున్న ప్రేమ బట్టబయలైంది. ఒత్తిళ్లకు లొంగి పశువధశాలపై అత్యంత మమకారం చూపిస్తున్న పోలీసుల తీరు పలు విమర్శలకు తావిస్తోంది. తేతలిలో పశువధ శాల ముందు గత రెండు రోజులుగా తేతలివాసులు నిర్వహిస్తున్న నిరసన శిబిరానికి మద్దతు పలికేందుకు మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో వచ్చిన సందర్భంలో ఆయన కూడా వచ్చిన ఫొటోగ్రాఫర్ సభ ప్రాంతాన్ని డ్రోన్ కెమెరాతో షూట్ చేస్తుండగా పోలీసులు వచ్చి కెమేరాను బలవంతంగా లాక్కున్నారు. ఇదేంటని బిత్తరపోయిన వారికి అసలు విషయం ఆనక తెలిసింది. డ్రోన్ ఎగిరిన వెంటనే కర్మాగారం నుంచి వచ్చిన ఫోన్ కాల్‌తో వెంటనే అక్కడే ఉన్న ఎస్‌ఐ చంద్రశేఖర్ కెమేరాను స్వాధీనం చేసుకోవడంతో వివాదాస్పదంగా మారింది. దీంతో స్పందించిన కారుమూరి డ్రోన్ కెమేరా ఇవ్వాలని పోలీసులను కోరగా కర్మాగారం లోపల ఏమైనా చిత్రీకరించారేమో పరిశీలించి ఇస్తామని చెప్పారు. దీంతో వెంటనే ఇవ్వాలని కారుమూరి అక్కడే బైఠాయించగా పోలీసులు కర్మాగారం ప్రతినిధిని పరిశీలించుకోమని కెమేరా వారికి ఇచ్చి ఏమీ లేదని తేలాక సీఐ అనుమతితో కెమేరాను అప్పగించారు. దీంతో తేతలి గ్రామస్థులు పోలీసుల తీరు చూసి ఖంగుతిన్నారు. ఈనెల 25వ తేదీన కూడా పశు వ్యర్థాలున్న వాహనాన్ని పోలీసులకు అప్పగించిన పరిస్థితుల్లో కర్మాగారం ప్రతినిధి స్టేషన్‌కు వచ్చి పోలీసులతో మంతనాలు జరపడం ఆ తర్వాత కేసు నమోదు చేస్తామని చెప్పి వాహనాన్ని పంపించేయడం, తాజాగా డ్రోన్ కెమేరా స్వాధీనం చేసుకోవడంపై తేతలి గ్రామస్థులు, గోసేవా సమితి సభ్యులు మండిపడుతున్నారు. అధికారుల తీరు కూడా అనుమానాస్పదంగా ఉందని బాధితులకు రక్షణ కల్పించకుండా పెత్తందారులకు అండగా నిలబడుతున్నారని విమర్శలు చేస్తున్నారు. అంతేకాకుండా మాకు పైనుంచి ఒత్తిళ్లు వస్తున్నాయని పోలీసు అధికారులు అంటున్నారని దీనివెనుక చాలా పెద్దమనుషులు ఉన్నారని గోసేవా సమితి సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో పోలీసులు ప్రజలకు రక్షణగా ఉండకుండా, పెత్తందార్లకు రక్షణ కల్పిస్తున్నారంట ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐశ్వర్యదుర్గ మాతకు విశేష పూజలు

అత్తిలి: స్థానిక రామన్నపేటలో గల ఐశ్వర్య దుర్గమాతకు శుక్రవారం విశేష పూజలు జరిపారు. ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈసందర్భంగా దాత పోలిశెట్టి చంటి సౌజన్యంతో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాసరి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అత్తిలి: నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో పి శామ్యూల్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. పార్థసారథి కోరారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టాన్ని రైతులు పొందేందుకు వీలుగా ఎకరాకు రూ. 615 కట్టుకోవాలన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోత బంతాట కేసులో ఆరుగురి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: కోత బంతాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై జేవీఎస్.ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జగ్గన్నపేట గ్రామ శివారులో కోత బంతాట ఆడుతున్న శిబిరంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.34,200 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్సై జేవీఎస్.ప్రసాద్ వివరించారు.

వాటర్ ప్లాంట్ పనుల పరిశీలన

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడులో చమటచెరువు వద్ద ట్రిపుల్‌ఎఫ్ కర్మాగారం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తోన్న వాటర్ ప్లాంట్ పనులను శుక్రవారం యాజమాన్యం, సిబ్బంది పరిశీలించారు. ప్రజల తాగునీటి వనరులు తీర్చేందుకు ట్రిపుల్‌ఎఫ్ కృషి అభినందనీయమని పలువురు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఎఫ్ సీఎస్ఆర్ మేనేజర్ శ్రీనివాస్, ఓపీ గోయంకా పీపీ వేమల శ్రీనివాస్, మజ్జి అప్పారావు, మట్టా రాంబాబు, తోట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ కార్యాలయంలో వార్షిక తనిఖీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పలువురు ఉద్యోగులు డిమాండ్ చేశారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్, జిల్లా ట్రెజరీ అధికారి ఎ.గణేశ్వరరావు శుక్రవారం తాడేపల్లిగూడెం ట్రెజరీ కార్యాలయంను పరిశీలించారు. వార్షిక తనిఖీ చేశారు. సబ్ ట్రెజరీ ఆఫీసర్ పి.జయదత్తేశ్వరరావు, సిబ్బంది సహకరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ భవనంను సందర్శించారు. సీనియర్ సిటిజన్స్, విశ్రాంత ఉద్యోగులు గణేశ్వరరావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు అధ్యక్షుడు బి.హరికుమార్, వై.వి.ఎస్.మూర్తి, తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

రెల్లి కులస్తులకు న్యాయం చేయాలి

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వర్గీకరణలో భాగంగా శుక్రవారం ఏలూరు కలెక్టర్ వారి కార్యాలయంలో ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాకు పశ్చిమగోదావరి జిల్లా రెల్లి కుల సంక్షేమ సంఘం తరపున వినతిపత్రం అందజేసినట్లు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొచ్చ ధర్మ తెలిపారు. రెల్లి కులస్తులకు రాష్ట్ర జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ శాతం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెల్లిసంఘం నాయకులు ధనాల శ్రీనివాస్, ధనాల వెంకటేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా రెల్లి కులసంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బంగారు కరుణరాజు, తాడికొండ జయరామకృష్ణ, టి వాసు, మాడుగుల దుర్గారావు, ధనాల చాముండేశ్వరి, జిల్లా నాయకులు ఆకుల అప్పారావు, ధనాలు ఏడుకొండలు, లండన్ శ్రీను, ఏసుబాబు, ఆకుల పోలరాజు, వివిధ సంఘాల రెల్లి నాయకులు పాల్గొన్నారు.


ఏలూరులో ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న రెల్లి కుల సంఘ నాయకులు

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రెల్లి కులస్తులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ జిల్లా రెల్లి కుల సంఘం నాయకులు ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఏకసభ్య రాజీవ్ రంజన్ మిశ్ర కమీషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు.

తణుకులో ఎక్సైజ్ అధికారుల దాడులు

తణుకు అర్బన్: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఇరగవరం మండలం అయినపర్రు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నేతల శ్రీను(41) అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై ఆర్. మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీని సద్వినియోగం చేసుకోవాలి

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం బస్టాండ్ నుంచి నరేంద్ర సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ కార్గో డోర్ డెలివరీ సదుపాయం అందరూ వినియోగించుకోవాలని, ఈ మాసోత్సవాల్లో డోర్ డెలివరీ బుకింగ్స్ చేసుకున్న వారికి వారం వారం లక్కీ డిప్ ద్వారా ముగ్గురు ప్రయాణికులకు బహుమతులు, మరో ముగ్గురికి చీరలు అందజేస్తున్నట్లు తెలిపారు. నరేష్ క్లాత్ షోరూమ్ యాజమాన్యం ప్రథమ, షాలేం పెన్ కార్నర్ యాజమాన్యం ద్వితీయ బహుమతులను అందజేస్తున్నట్లు చెప్పారు. డిపో ఉద్యోగులు, సెక్యూరిటీ, గారేజ్, కార్గో సిబ్బంది, డ్రైవర్‌లు, కండక్టర్‌లు, సూపర్ వైజర్స్ పాల్గొన్నారు.


తణుకులో కార్గో మాసోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మద్యం విక్రయదారుడి అరెస్టు

పెంటపాడు: బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గూడెం ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. గూడెం సీఐ ఇ. స్వరాజ్యలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం గూడెం ఎక్సైజ్ పరిధిలో వేరువేరు ప్రదేశాలలో దాడులు చేశామన్నారు. దర్శిపర్రు గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒక ముద్దాయిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

తణుకు అర్బన్: భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మనమధ్య లేకపోవడం బాధాకరమని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు కప్పల వెంకన్న సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో మన్మోహన్ సింగ్‌కు శుక్రవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రిగా భారతదేశ ఆర్థికపరిస్థితిని మెరుగుపరచడమే కాకుండా ప్రపంచదేశాలకు దేశకీర్తిని చాటిచెప్పిన మహనీయుడు అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ నేతగా ఆయనను దగ్గరగా కలిసిన అనుబంధం తనకు ఉందని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి రెండు నిముషాలపాటు మౌనం పాటించారు. పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నేడు తణుకు డంపింగ్ యార్డులో క్రిస్మస్ వేడుకలు

పెంటపాడు: తణుకు ఈఫీఎఫ్ అధ్యక్షుడు పి. మోజెస్ ప్రవీణ్ ఆధ్వర్యంలో శనివారం డంపింగ్ యార్డు కార్మికుల వద్ద కిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి నెలా ఆహార పంపిణీలో భాగంగా తణుకు పరిసర ప్రాంతాలలో ఆహార కొరతతో ఉన్నవారిని గుర్తించి వారికి ఆహారం పంచి డంపింగ్ యార్డు కార్మికుల సమక్షంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నిరాశ్రయులను గుర్తించి వారికి దుప్పట్లు అందజేస్తామన్నారు. ఈపీఎఫ్ సంఘ వ్యవస్థాపకురాలు పి. అరుణకుమారి, దైవసేవకురాలు ఫ్రైజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వన్ టౌన్ నార్త్ పరిధిలో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు హౌసింగ్‌బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు సెమి ఇండోర్ పరిధిలో అన్ని ఏరియాలలో వివిధ లైన్‌లకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 28వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి వెల్లడించారు. పట్టణ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.